# అందరిలో ఈశ్వరత్వాన్ని దర్శించండి

విద్యార్థులారా!

**ఆకుపచ్చ పక్షులన్ని చిలుకలవలె పలుకునా!**
**పుష్పములపై పొరాడెడు పురుగులు తుమ్మెద లగునా!**
**ఏనుగంత బలిసినంత పంది ఏనుగగునటయ్యా!**
**తానెవరో తెలియకున్న తత్త్వ జ్ఞానమెట్లు కలుగు!**

మానవుడీనాడు తనను తాను గొప్పవానిగా భావించుకుంటున్నాడు. మానవత్వము లేనివాడు మానవుడే కాదు. మానవత్వమును అర్థం చేసుకొని వర్తించేటటు వంటివాడే నిజమైన మానవుడు. సత్య ధర్మ శాంతి ప్రేమ అహింసలను ఆచరణలో పెట్టి, అందరికీ బోధించేవాడే మానవుడు. ఇందులో ఏ ఒక్క లక్షణము లేకపోయి నప్పటికీ అది అవలక్షణమే! మానవుడు గొప్ప తెలివితేటలు గలవాడు. ఆ తెలివితేటలు అంతా ఇంతా కాదు. కాని, ఆచరణలో అవి కనిపించడం లేదు.

**ద్వైతభావము ఉన్నచోటే సందేహము ఉంటుంది**

ఒకానొక సమయంలో ఈశ్వరుడు తపోదీక్షలో కూర్చున్నాడు. అతనిని వివాహమాడాలని ఆశించింది, పార్వతి. ఈశ్వరుడు ఆమెకు తగినవాడు కాదని నచ్చ జెప్పడానికి ఆమె తల్లిదండ్రులు ప్రయత్నించారు:

**"నీవు బాలవే కద గౌరమ్మా**
**సాంబశివుడు ముసలివాడమ్మా**
**తలనిండా జడలవాడమ్మా**
**తాను కట్టింది పులిచర్మమమ్మా**
**ఎద్దు వాహనమెక్కుతాడు**

sri sathyasaivachanamrutam

**ఏ ప్రొద్దూ తిరుగుచుండువాడు**
**పుట్టలోని పాములు చుట్టుకున్నాడమ్మా**
**గుట్టు తెలియక నీవెట్లు వరించితివి?**
**ఒక ఇల్లు లేదు, వాకిలి లేదు**
**ఒలుకుల్లో పండుకుంటాడు"**

వారికి పార్వతి ఏమీ సమాధానం చెప్పలేదు. పార్వతి తత్త్వము ఈశ్వరుని కెఱుక. ఈశ్వరుని తత్త్వము పార్వతి కెఱుక. ఇరువురూ వేరువేరు కాదు, ఒక్కటే. శివశక్త్యాత్మక స్వరూపుడు ఈశ్వరుడు. శివశక్త్యాత్మక స్వరూపమే పార్వతి. ఇటువంటి నిగూఢమైన తత్త్వాన్ని సామాన్యులు ఏవిధంగా అర్థం చేసుకోగలరు! ఎక్కడ ద్వైతభావము ఉంటుందో అక్కడే 'డౌటు' (సందేహము) వస్తుంది. A man with dual mind is half blind. కాని, వీరిద్దరికికూడను ద్వైతభావము లేదు. సరస్వతి వచ్చి, "అమ్మా, పార్వతీ! భర్త ఒకవిధంగా, భార్య ఇంకొకవిధంగా ఉండటాన్ని సమాజము ఒప్పుకోదు. నీవు సర్వజ్ఞురాలవు, సర్వవ్యాపివి, సర్వ శక్తిమంతురాలవు. అన్నీ తెలిసి నీవు భ్రాంతిలో మునిగినావే!" అన్నది. అప్పుడు పార్వతి "సరస్వతీ! నాలో ఈశ్వరాసక్తి మాత్రమే ఉంటున్నది. మరి దేనిపట్ల కూడను నాకు ఆసక్తి లేదు. నా నిర్ణయాన్ని ఎవ్వరూ మార్చలేరు" అన్నది.

"ఈశావాస్య మిదం సర్వం" ఈశ్వరుని శక్తి సర్వత్రా వ్యాపించినటువంటిది. ఈశ్వరత్వమును ప్రేమించడమే మానవుని ప్రధానమైన కర్తవ్యము. ఈ □□□□□□ □□□□□ (దివ్యశక్తి) ప్రతి వ్యక్తియందు దాగియున్నది. మీ దేహమును మీరు వస్త్రముతో ఏవిధముగా కప్పుకొని ఉన్నారో అదేవిధముగనే సర్వత్రా ఉన్న ఈశ్వరత్వమునకు మాయ తెర అడ్డుగా ఉన్నది. అందువల్లనే అది మన కంటికి గోచరించడం లేదు. "ఈశ్వర స్సర్వభూతానాం", "ప్రతి ఒక్కరియందుకూడను ఈశ్వరత్వమే ఉన్నది. ఈశ్వరత్వము వయస్సుకు అతీతమైనది; వేషభాషలకు ఏమాత్రము సంబంధించినది కాదు", అని చెప్పింది పార్వతి.

లక్ష్మికూడా వచ్చి పార్వతితో, "అమ్మా! నీవు చాలా అందమైనదానవు, గొప్ప శక్తిసామర్థ్యములు గలదానవు. ఇటువంటి నీవు ఇంటింటికీ తిరుగుతూ భిక్షమెత్తే వానిని భర్తగా వరించడం న్యాయం కాదు" అన్నది. అప్పుడు పార్వతి, "నా భర్త భిక్షగాడు కాదు,

sri sathyasai vachanamrutam

ప్రపంచమునకే భిక్షము పెట్టేటటువంటివాడు. అతనిని నిందించడం మీబోటివారికి మంచిది కాదు", అని చెప్పింది.

**అహంకార, మమకారములు విషపు కోరలవంటివి**

మరికొందరు దేవతలు వచ్చి పార్వతిని ప్రశ్నించారు, "పుట్టలోని పాములు చుట్టుకున్నాడమ్మా. గుట్టు తెలియక నీవెట్లు వరించితివి?" పాములకు కంటి యందు మాత్రమే విషం ఉంటుంది. కాని, ఈనాటి మానవునికి నిలువెల్ల విషమే! చూపులో విషము, వినికిడిలో విషము, పనులలో విషము! ఈవిధంగా నిలువెల్ల విషము నింపుకున్నవానిని మీరు మంచివాడని భావిస్తున్నారు. పాముకున్న రెండు కోరలు తీసివేస్తే అది ఎవ్వరికీ హాని చేయలేదు. కాని, నేటి మానవుడు అహంకార మమకారములనే రెండు విషపు కోరలు పెట్టుకొని ప్రపంచమంతా ధైర్యంగా సంచరిస్తున్నాడు. తాను గొప్పవాడనని భావిస్తున్నాడు. తనయందున్న అహంకార మమకారములను విషపు కోరలుగా భావించుకొనక వాటిని అమృతతుల్యంగా భావిస్తున్నాడు. ఇది చాలా పొరపాటు.

**తన కలిమి భంగపుచ్చును**
**తనకుంగల గౌరవంబు దగ్ధము సేయున్**
**తనవారల కెడ సేయును**
**జనులకు గర్వమువలన సర్వము చెడున్**

అట్టి విషమును ఈనాటి మానవుడు తన ఒళ్ళంతా నింపుకున్నాడు. ఇట్టి మానవత్వాన్ని ఏవిధంగా చక్కచేయగలము!

**విషయవాసనలతో ప్రేమను విషంగా మార్చుకోవద్దు**

భగవంతుణ్ణి సర్వులుకూడను ప్రేమిస్తుంటారు. ప్రతి మానవుడుకూడను ప్రేమచేతనే జీవిస్తున్నాడు. ప్రేమ లేనటువంటి మానవుడు మానవుడే కాదు. భగవంతునికి, మానవునికి మధ్య ఉన్న ప్రేమ తండ్రీ, బిడ్డల ప్రేమ. ఇట్టి పవిత్రమైన ప్రేమతత్త్వానికి అపార్థములు కల్పించడం ఎవరి తప్పు? సమాజంలో చోటుచేసుకున్న దుర్గుణముల ప్రభావమే ఇది. లైలా మజ్నుల పవిత్రమైన ప్రేమతత్త్వాన్ని సరిగా అర్థము చేసుకొనలేక జనులు అనేక పిచ్చిపిచ్చి

sri sathyasai vachanamrutam

భావములకు చోటిస్తూ వచ్చారు. ఒక దినము లైలా చెప్పింది -

**విషమాయె ప్రేమ మసి ఆయె మనసు**

**ఏవిధముగా భరియింతునో ....**

ప్రేమ విషముగా మారకూడదు. మనస్సు ప్రేమమయం కావాలేగాని, విషయవాసనలు పెంచుకొని విషంగా మారిపోకూడదు. మనస్సు ప్రేమమయ మైనప్పుడే మనము సుఖాన్ని పొందుతాము.

**అందరియందుకూడను దివ్యత్వాన్ని దర్శించాలి**

సమాజములో ఉన్నటువంటి ప్రతి వ్యక్తికూడను దైవత్వముతోకూడినవాడనే సత్యాన్ని గుర్తించి వర్తించి నప్పుడు మనకు భేదములు ఏమాత్రము కనిపించవు. అందరియందుకూడను మనం దివ్యత్వాన్ని దర్శించాలి. అప్పుడు ఎవ్వరికినీ ఏవిధమైన భేదములూ సంభవించవు. అందరుకూడను ఒక్కటే! All are one, be alike to everyone. ఈవిధముగా మనము సరియైన మార్పును తెచ్చుకోవాలి. మీరు అనేక గ్రంథాలు చదువుతున్నారు. చదివినటువంటివాటిలో సత్యాన్ని మీరు గుర్తించాలి. 'నేను' అనే దివ్యత్వం ప్రతి ఒక్కరియందున్నది. 'నేను' అనగా బ్రహ్మ కాదు, విష్ణువు కాదు, ఈశ్వరుడు కాదు. 'నేను నేనే.' బ్రహ్మ, విష్ణువు, ఈశ్వరుడు అనేవి పెట్టిన పేర్లేగాని, పుట్టిన పేర్లు కావు. మానవుడు గుర్తుకోసం పేర్లు పెట్టుకుంటున్నాడు. కాని, పేర్లు ప్రధానం కాదు. బ్రహ్మ సృష్టికర్తయని, విష్ణువు రక్షణకర్తయని, శివుడు లయకర్తయని భావిస్తున్నాము. ఎవరెవరి భావములను పురస్కరించుకొని వారికి ఆయా రూపములలో భగవంతుడు దర్శనమిస్తుంటాడు.

**తల్లిదండ్రులను మరచినవానిని భగవంతుడు కూడా కాపాడలేడు**

ఒక పర్యాయం శివపార్వతులు ఆకాశ మార్గాన సంచరిస్తూ ఉండగా ఒక వ్యక్తి చెట్టుపైకెక్కి తాను కూర్చున్న కొమ్మను తానే నరుక్కుంటున్న దృశ్యం వారి కంట పడింది. కొంతసేపటిలో అది విరిగి పడి పోయేటట్లుంది. అది గమనించి పార్వతి ఈశ్వరునితో, "నాథా! వీడు క్రిందపడిపోకుండా రక్షించండి", అని ప్రార్థించింది. "పార్వతీ! మొదట

srisathyasaivachanamrutam

చూసినదానవు నీవు. అతడు క్రిందపడిపోతే మరణిస్తాడన్న విషయం నీకే అర్థమైంది. కాబట్టి, అతనిని రక్షించవలసిన బాధ్యత నీదే" అన్నాడు ఈశ్వరుడు. అప్పుడామె, "స్వామీ! ఎవరైనా క్రిందపడినప్పుడు 'అమ్మా' అనో లేక 'అప్పా' అనో అరుస్తారు. 'అమ్మా' అని అరిస్తే నేను రక్షిస్తాను. 'అప్పా' అంటే మీరు రక్షించాలి" అన్నది. ఈశ్వరుడు సరేనన్నాడు. కొద్దిసేపటికి కొమ్మ విరిగింది; వాడు క్రిందపడ్డాడు. అమ్మ రెడీగా ఉన్నది రక్షించడానికి. అప్పకూడా సిద్ధంగా ఉన్నాడు. కాని, వాడు 'అమ్మా' అనలేదు, 'అప్పా' అనలేదు; 'అయ్యో' అన్నాడు. శివ పార్వతులిద్దరూ వానిని రక్షించడానికి కాచుకొని ఉండినప్పటికీ వాడి నోటినుండి ఆ పదములు రాలేదు. కనుక, తల్లిదండ్రులను మనం ఎప్పుడూ జ్ఞప్తియందు ఉంచుకోవాలి.

"మాతృదేవో భవ, పితృదేవో భవ, ఆచార్యదేవో భవ, అతిథిదేవో భవ". నీవు గొప్ప విద్యావంతుడివి కావచ్చు; ఈ ప్రపంచంలో ఉన్న సమస్త విద్యలందు ఆరితేరియుండవచ్చు. కాని, తల్లికి నీవు కుమారుడవే! తల్లి దీవెనలు ఎప్పుడూ నీ ఇంటనే, వెంటనే, జంటనే ఉంటుంటాయి. అట్టి తల్లిని మరచిన తనయుని జీవితం వ్యర్థం. రక్షించేటటువంటి దయార్ద్ర హృదయం ఒక్క పార్వతికి మాత్రమే ఉంటున్నది. ఈశ్వరుడు తండ్రి, శక్తిస్వరూపిణియైన పార్వతియే తల్లి. ఈశ్వరుడు అంత స్వేచ్ఛగా ముందుకు పోవడానికి వీల్లేదు. శక్తి ముందు అడుగుపెట్టినప్పుడే ఈశ్వరుడు వెనుక వస్తాడు. కాబట్టి, మొట్టమొదట శక్తిస్వరూపిణిని ఆరాధించాలి. ఆమెయే తల్లి. కనుకనే మొట్టమొదట 'మాతృదేవో భవ' అన్నారు. తల్లికే ప్రథమ స్థానం అందించబడింది. మన స్వదేశమునుకూడను తల్లితో పోల్చుకుంటున్నాము. □□□□□ □□ □□ □□□□□□□□□□ (భారతదేశం నా మాతృభూమి) అంటారేగాని, □□-□□□□□□□□ (పితృభూమి) అని ఎవ్వరూ అనరు.

తల్లి మరణించినా ఆమె □□□□ మాత్రం నిరంతరం బిడ్డలపైనే ఉంటుంది. ఒక దినము ఒక తల్లి వచ్చి, 'స్వామీ! నా కుమార్తె అందరి మాటలను వింటుంది. కాని, తమ మాటలకే ఆమె ప్రాధాన్యత నిస్తుంది. మొదటినుండికూడను నా బిడ్డకు మొండితనము మెండు. నేనెన్ని చెప్పినా వినదు. మీరు ఒకతూరి చెబితే వింటుంది. మీరు చెప్పిన మాటను

sri sathyasai vachanamrutam

జవదాటదు", అన్నది. ఈరీతిగా తల్లులు వచ్చి దైవాన్ని ఎన్నో రకములుగా ప్రార్థిస్తుంటారు. తల్లికి మించిన దైవము లేదు. కాబట్టి, తల్లిని మనమెన్నటికీ మరువకూడదు. తల్లిని మరచినవారికి అనేక రకములైన కష్టములు కలుగుతుంటాయి. తల్లిని గౌరవించాలి, ప్రేమించాలి, వారికి తగిన కృతజ్ఞత చూపాలి, సేవలు చేయాలి. అప్పుడే స్త్రీ, పురుషులు ఉన్నత స్థితిని చేరుకోగలరు. మీరెంత గొప్పవారైనప్పటికీ, ఐ.ఎ.ఎస్. పాసైనప్పటికీ తల్లి మాటను ప్రాణసమానంగా భావించాలి.

పెండ్లి అయిన తరువాత ఆడవారు అత్తవారింటికి వెళతారు. అత్తగారిని ఆంగ్లంలో mother-in-law అంటారు. ఈ ప్రపంచమున కంతటికీ mother-in-love పార్వతి. law (చట్టము) అనేది ప్రపంచానికి సంబంధించినదయితే love (ప్రేమ) హృదయానికి సంబంధించినది. కనుక, ప్రేమను పెంచుకోండి. ప్రేమయే మీ సర్వస్వంగా భావించుకోండి. అప్పుడే మీరు సరియైన జీవితాన్ని గడిపిన వారవుతారు. తల్లి ఎంత పిచ్చిదైనా కావచ్చు, ఎంత శక్తిహీనురాలైనా కావచ్చు. కాని తల్లి తల్లియే! ఆమె శక్తిహీనురాలైనది కదా అని ఆమెను మీరు విస్మరించి పోకూడదు. తల్లి ఎప్పటికికూడను ప్రేమతో నిండి ఉంటుంది. కనుకనే, భక్త రామదాసుకూడా, "అమ్మా సీతమ్మతల్లీ! నీవు రామునితో చెప్పి నాకు సహాయం చేయించు. మీరిరువురూ చేరి మాట్లాడుకుంటున్న సమయంలో నా విషయాన్ని కొంచెం రాముని చెవిలో వేయి" అని ప్రార్థించాడు. రామదాసు తహసీల్దారుగా పని చేసేవాడు. "స్వామీ! నేను వసూలు చేసిన డబ్బంతా నీకే అర్పితం చేశాను" అంటూ అతను ఈ పాట వ్రాశాడు:

**"లక్ష్మణునకు చేయిస్తి బంగారు మొలత్రాడు రామచంద్రా!**
**ఆ మొలత్రాటికి పట్టె పదివేల వరహాలు రామచంద్రా!**
**సీతమ్మకు చేయిస్తి చింతాకు పతకము రామచంద్రా!**
**ఆ పతకమునకు పట్టె పదివేల వరహాలు రామచంద్రా!**
**కలికితురాయి నీకు కుదురుగ చేయిస్తి రామచంద్రా!**
**ఎవడబ్బ సొమ్మని కులుకుతు తిరిగెదవు! రామచంద్రా!"**

sri sathyasaivachanamrutam

**వినయ, విధేయతలే మనకు గొప్పతనాన్ని కల్గిస్తాయి**

అహంకార, మమకారములను వీడనంతవరకు దేనినీ మనం సాధించలేము. వినయ విధేయతలతో దేనినైనా సాధించవచ్చు. నైతిక, భౌతిక, ధార్మిక, ఆధ్యాత్మిక, రాజకీయరంగములన్నింటియందుకూడను మనం భక్తితో, వినయ విధేయతలతో ఉండాలి. అప్పుడే అన్నింటికీ ఒకవిధమైన కళ చేకూరుతుంది.

కలకత్తాకు సమీపంలోని ఒక గ్రామంలో ఈశ్వరచంద్ర విద్యాసాగర్, అతని తల్లి నివసించేవారు. ఆ తల్లి ఎంతో కష్టపడి కుమారుని పోషిస్తూ వచ్చింది. ఇంట్లో దీపం లేకపోవడంచేత విద్యాసాగర్ రాత్రిపూట వీధి దీపాల దగ్గర కూర్చుని చదువుకునేవాడు. ఈవిధంగా అతను రాత్రింబవళ్ళు కష్టపడి చదివి ఉన్నతస్థితికి వచ్చాడు; గొప్ప వక్తగా పేరు పొందాడు. అతని ఉపన్యాసాలు వినడానికి ప్రజలు వేలసంఖ్యలో ప్రోగయ్యేవారు.

ఒక పర్యాయం విద్యాసాగర్ ట్రైనులో ప్రయాణమై వేరే ఊరికి వెళ్ళాడు. ఆరోజున ఆ ఊర్లో ఏర్పాటైన ఒక కార్యక్రమంలో ఆయన ప్రసంగించవలసి ఉండినది. ఆయనతోపాటు ఒక ఐ.సి.ఎస్. ఆఫీసర్ ఒక చిన్న సూట్‌కేసు పట్టుకొని స్టేషన్లో దిగాడు. దిగుతూనే ఆ ఆఫీసరు తన పెట్టె మోయడానికి ఎవరైనా కూలీ దొరుకుతాడేమోనని చూస్తున్నాడు. ఆయన 'కూలీ, కూలీ' అని అరుస్తుంటే విద్యాసాగర్ వెళ్ళి, "సార్, ఆ పెట్టె నాకివ్వండి. నేను మోస్తాను. మీరెక్కడికి వెళ్ళాలి?" అని అడిగాడు. "నేను ఈశ్వరచంద్ర విద్యాసాగర్ ఉపన్యాసం వినడానికి వెళుతున్నాను", అన్నాడా అధికారి. ఆ మాటలు విని విద్యాసాగర్ నవ్వుకొని ఆ పెట్టె పట్టుకొని బయలుదేరాడు. సమావేశం జరిగేచోటికి వెళ్ళిన తరువాత విద్యాసాగర్ అతనికి సూట్ కేసును అందజేయగా, "ఇదిగో, ఈ డబ్బు తీసుకో" అంటూ ఆ ఆఫీసరు కొంత డబ్బు ఇవ్వబోయాడు. అప్పుడు విద్యాసాగర్, "అయ్యా, నేను ఈ పని సేవా భావంతో చేశానుకాని, డబ్బుకోసం కాదు" అని చెప్పి వెళ్ళిపోయాడు.

సమావేశంలో అందరితోపాటు ఈ ఐ.సి.ఎస్. ఆఫీసరుకూడా కూర్చున్నాడు. విద్యాసాగర్ వేదికపైకి వస్తూనే అతనికి పూలమాలలు వేసి స్వాగతం పలికారు. రైల్వే స్టేషన్‌నుండి తన సూట్‌కేసును మోసుకొని వచ్చిన వ్యక్తి అతడేనని గుర్తించి ఆ ఐ.సి.ఎస్.

srisathyasaivachanamrutam

ఆఫీసరు తాను చేసిన పనికి సిగ్గుపడ్డాడు. సభ ముగియగానే వెళ్ళి విద్యాసాగర్ పాదాలపై పడి క్షమాపణ కోరాడు. విద్యాసాగర్‌యొక్క వినయ విధేయతలే అతనికి అంత గౌరవాన్ని తెచ్చిపెట్టాయి. ఈనాటికికూడా అతని చరిత్రను మీరు పుస్తకాల్లో చదువుతుంటారు. మనం చదివే చదువులో లేదు గొప్పతనం. మన వినయవిధేయతలే మనకు గొప్పతనాన్ని కలిగిస్తాయి. లోకములో ఎందరో విద్యావంతులున్నారు. కాని, ఏమి ప్రయోజనం? వాళ్ళవలన లోకానికి కలుగుతున్న ఉపకార మేమిటి? అహంకార, మమకారములవలననే మానవుడు చెడిపోతున్నాడు. ఈ రెండింటినీ త్యజించినప్పుడే మనము గొప్పవారము కాగలము.

**ఎవరు నిజమైన సర్వసంగ పరిత్యాగి?**

ఒక పర్యాయము ఆదిశంకరులవారు మండన మిశ్రుడనే ఒక గొప్ప పండితునితో వాదము వేశారు. మండనమిశ్రుని ధర్మపత్ని ఉభయభారతి. ఆమె సకలజ్ఞానసంపన్నురాలు. అందుచేత, శంకరులవారు తమ ఇరువురిమధ్య జరిగే వాదంలో ఎవరు విజయం సాధించారనేది నిర్ణయించడానికి ఉభయభారతినే మధ్యవర్తిగా ఎన్నుకున్నారు. ఉభయభారతి తన భర్త ఓడిపోయినాడని, శంకరులవారు విజయం సాధించారని తీర్పు చెప్పింది. మండనమిశ్రుడు తాను చేసిన ప్రతిజ్ఞ ననుసరించి సన్యాసం స్వీకరించాడు. అతని అర్ధాంగి ఉభయభారతికూడా సన్యాసం స్వీకరించింది. ఆమె ఒక ఆశ్రమమును నిర్మించుకొని, స్త్రీలకు జ్ఞానబోధలు సల్పుతూ వచ్చింది. ఒకనాడు ఆమె తన శిష్యురాండ్రను వెంటపెట్టుకొని గంగానదికి వెళుతున్నది. మార్గమధ్యంలో ఒక చెట్టుక్రింద ఒక సన్న్యాసి తన నీటిబుఱ్ఱను ఎవరైనా దొంగిలిస్తారేమో అన్న భయంచేత తలక్రింద పెట్టుకొని పడుకున్నాడు. అది చూసి ఉభయభారతి తన శిష్యురాండ్రతో "ఆహా! ఇతడు పేరుకు సర్వసంగపరిత్యాగియేగాని నీటి బుఱ్ఱపైన ఇంకా అతనికి అభిమానము పోలేదు" అని అతనికి వినపడేలా అన్నది. ఆమె మాటలు అతనికి కోపం తెప్పించాయి. వాళ్ళు గంగలో స్నానం చేసి తిరిగి వస్తూండగా అతడా బుఱ్ఱను తీసి విసిరేశాడు. అప్పుడు ఉభయభారతి, "ఇతనిలో ఒక్క దోషమే ఉన్నదనుకున్నాను. కాని, నిజంగా రెండు దోషము

లున్నవి", అన్నది. ఏమిటా రెండు దోషములు? నీటిబుఱ్ఱను దాచుకోవటం అభిమానం; ఉభయ భారతి తనను విమర్శించిందనే కోపంచేత దానిని తీసి విసిరివేయడం అహంకారం. "అభిమాన, అహంకారములను త్యజించనివాడు సర్వసంగపరిత్యాగి కాజాలడు", అన్నది ఉభయభారతి. అప్పుడా సన్యాసి వెళ్ళి ఆమె పాదాలపై పడి తన దోషాలను క్షమించవలసిందిగా కోరాడు. "నాయనా! ఇప్పుడు నీవు నిజంగా సర్వసంగపరిత్యాగివైనావు" అన్నది ఉభయ భారతి.

మహాభారతంలో కర్ణుడికి ఎటువంటి అహంకార మమకారములూ లేవు. మీరు కర్ణుడివంటివారుగా తయారు కావాలిగాని, దుర్యోధన దుశ్శాసనుల మాదిరి తయారు కాకూడదు. ప్రతి విద్యార్థికూడను ఒక కర్ణుడు కావాలి; చక్కని విషయాలను వినాలి; వాటిని ఆచరణలో పెట్టాలి; ఆనందాన్ని అనుభవించాలి; అనుభవించిన ఆనందాన్ని అందరికీ పంచాలి. ఇదే మీ ప్రధానమైన కర్తవ్యం.

**(శివరాత్రి అఖండ భజన అనంతరం, తేదీ 17.02.2007, సాయికుల్వంత్ సభామండపం)**

sri sathyasai vahanamrutam